

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# దయచేసి అనాగరికుల అడ్రసు చెబుతారా ?

డాక్టరేట్ పొందాలన్నది నాకున్న ఒకే ఒక ఆశయం. ప్రొఫెసర్ సత్య శివ సుందరం గారి దగ్గరికి వెళ్ళి నా మనసులోని మాట చెప్పాను.

"ఆడవాళ్ళ కన్నీటి కథలు వినివిని ఈ ప్రపంచం విసుగెత్తి పోయిందమ్మా. మళ్ళీ ఆ కథలనే ఎందుకు వినిపిస్తావు ?" అని అడిగాడు. అన్నీ తెలిసినవారు అనుకుని ఆయన దగ్గరికి వెళ్ళి అడిగాను. అందరి లాగానే ఆయనా మాట్లాడారు.

"స్త్రీల కన్నీటి వరదలతోనే నదులన్నీ పొంగి పొరలుతున్నాయి. కానీ కథ అదే. కన్నీరూ అదే. కానీ ఇన్నాళ్ళు కాలం గుండెల్లో గాయం చేస్తే ఓర్చుకుంటూ బ్రతికింది. ఇంక ఓర్పు సన్నగిల్లింది. సహనం చచ్చిపోయింది. ఇప్పుడు చెలి కన్నుల్లో మిన్నాగులున్నాయి. తరుణి అరుపులకు ధరణి దద్దరిల్లుతోంది. గతకాలపు పాతాళ లోకాల చీకటి గుహల్లో బందీ గా ఉండే పరిస్థితులు లేవు. కలత కన్నుల నెలత వ్యర్థ జీవితానికి వెగచి చైతన్య జడంగానో, జడ చైతన్యంగానో ఉండి పొయే తేదీల కాలెండర్లు చినిగి పోయాయి....." అని చెప్పాను.

ప్రొఫెసర్ గారు కొంచెం ఆగి ఆలోచించి అన్నారు "ప్రపంచం అంటే నగరాలూ, పట్టణాలే కాదమ్మా. కొండల్లో, లోయల్లో, అడవుల్లో అనాగరికులు ఎంతో మంది ఉన్నారు. వాళ్ళ జీవితాలు ఎలా ఉన్నాయి ? వారి వివాహాలు, తీరుతెన్నుల్లో ఎన్నో వింతవింత పోకడలున్నాయి. నీకు ఓపిక ఉంటే వెళ్ళి అనాగరికుల జీవితాలను అధ్యయనం చెయ్యి. తరువాత ఓ పరిశోధనా వ్యాసం రాసి తీసుకు రా. " అన్నారు.

అలాగే అన్నాను. అప్పటి నుంచీ అనాగరికులు ఎక్కడ ఉంటారో తెలుసు కోవటానికి ప్రయత్నించాను. అనాగరికుల అడ్రసు చెప్పమని కనిపించిన వాళ్ళందరినీ అడిగాను. నగరాల్లో, పట్టణాల్లో అనాగరికులు ఉండరు, అడవుల్లోకి వెళ్ళమని ప్రొఫెసరు గారు చెప్పిన మాటే అందరూ చెప్పారు.

అనాగరికుల కోసం వెదుకుతూ యాత్ర ప్రారంభించాను. వాళ్ళ ప్రేమలూ, పెళ్ళిల్లూ జీవన విధానాలూ ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ఉన్న మాట నిజమే. ఇన్ని భిన్న జాతులు, సంస్కృతులూ, అలవాట్లూ, అచారాలూ ఉన్న వాళ్ళు ఒక చోట కలిసి ఉండటమే గొప్ప విషయం అనిపించింది.

అరుణాచల ప్రదేశ్ వెళ్ళాను. షెర్గాన్ అనే గ్రామం లో రెండు రోజులున్నాను. నేను వెళ్ళిన రోజునే ఒక సంఘటన జరిగింది. ఆ గ్రామం లో బాత్ రూం లు, టాయలెట్స్ లేవు. కాలకృత్యాలు తీర్చుకోవటానికి రెండు మైళ్ళ దూరం లో ఉన్న కాలువ వద్దకు వెళ్ళాం. అక్కడే స్నానాలు చేసి ఇంకో ఇద్దరు అమ్మాయిలతో కల్సి వస్తున్నాం. ఇంతలో ఎవరో నలుగురు యువకులు మా దారికి అడ్డంగా నిలబడ్డారు. నా పక్కన ఉన్న అమ్మాయిని భుజం మీదకు ఎత్తుకుని తీసుకు పోయారు. అలా తీసుకు పోవటం అక్కడ మామూలేనట. నా పక్కన ఉన్న అమ్మాయిలు నవ్వుతూ చోద్యం చూస్తూ ఉండి పోయారు. నాకేమీ అర్థం కాలేదు. ఆ అమ్మాయిని ఎత్తుకు పోయి రెండు మూడు రోజులు దాచి ఉంచి తరువాత ఆ అమ్మాయి తల్లిదండ్రులకు తెలియ జేస్తారు. పెద్దవాళ్ళు వాళ్ళ వివాహం జరిపిస్తారట. ఈ అచారం అనాగరికంగా అనిపించినా చివరకు సుఖాంతమే అవుతుంది. అపహరణ కార్యక్రమం అంతా రుక్మిణీ కల్యాణం లోని భాగమే అని తెలిసాక తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.

ఖండుల తెగ వారి లోనూ ఇదే అచారం ఉంది. బౌద్ధ మతానికి చెందిన కల్మిక్స్ వారిలోనూ ఇదే అచారం ఉంది. అమ్మాయిని అపహరించుకు పోయి తరువాత వివాహం చేసు కుంటారు. లాహుల్ లోయలో ఇలా అమ్మాయిలను ఎత్తుకు పోయినందుకు పోలీసు కేసులు పెట్టుకున్న సమయాలూ ఉన్నయి. కుల పెద్దలు వచ్చి సర్ది చెప్పి కేసులు ఉప సం హరించు కునేలా చేస్తారు. గొండుల జాతి లో ఆడపిల్ల ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం జరగటం మామూలే.

హిమాలయాల దగ్గర పహారీ జాతి వారి అలావాటు వేరు గా ఉంది. అక్కడ వరుడు వధువు కుటుంబానికి డబ్బు చెల్లించాలి. ఈ డబ్బు పెళ్ళి ఖర్చులకూ, విందులకూ, వినోదాలకూ సరి పోతుంది. అస్సీరియా లో ఆడపిల్లలను వేలం వేస్తారు. ఎక్కవ డబ్బుకు వేలం పాడిన వారు ఆ అమ్మాయిని తమతో తీసుకు పోతారు.

హరియానా లో బిష్నొయిస్ తెగ లో వింత అచారం ఉంది. ప్రతి ఊళ్ళో తెలివి గల ఇద్దరు ముగ్గురిని ఖగర్ అంటారు. వీళ్ళు ఆ ఊరి లో ఏ స్త్రీ తో అయినా శారీరక సంబంధం పెట్టుకోవచ్చు. మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, హిమాచల ప్రదేశ్ లలో అన్న దమ్ములలో ఏ ఒక్కరి భార్య తో అయినా మిగిలిన వారు సంబంధం పెట్టుకోవచ్చు. హిమాలయాల్లోని మంగోలియా యాడ్స్ లోను, తోడం తెగల వారి లోనూ పాండవుల కాలం నాటి అచారం అమలు లో ఉంది. కొచ్చిన్ లోనూ, మలబార్ లోనూ అన్న దమ్ములు కాని వారు కూడా ఒకే స్త్రీ ని భార్యగా భావించటం కద్దు.

అస్సాం లోనూ కొన్ని తెగల వారి లో మాతృస్వామ్యం అమలు లో ఉంది. కేరళలోనూ కొన్ని చోట్ల ఇదే అచారం కొన సాగుతున్నది. ఒకానొక తెగ వారిలో వివాహం జరిగాక భర్త అత్తారింట్లో కాపురం చెయ్యటానికి వెళ్తాడు.

ఇవన్నీ తిరిగాక నేను మధ్య ప్రదేశ్ లోని చంబల్ లోయ వద్దకు వెళ్ళాను. పూలన్ దేవి తల్లిని కల్సుకున్నాను. ఆ ఊరికి చేరే టప్పటికి చీకటి పడింది. ఆ ఊళ్ళో అందరూ నన్ను వింతగా చూసారు. అయినా ఇలాంటి వాటికి బాగా అలవాటు పడి పోయాను. ఆ రాత్రికి అక్కడే ఉన్నాను.

కరెంట్ లేదు, దీపం వెలుతురు లో జొన్న రోట్టెను పచ్చి మిరప కాయల కారం లో నంజుకుని తిని నీళ్ళు తాగాను. ఆరు బయట మంచాల మీద కూర్చున్నాం. ఆమెతో వచ్చిన పని చెప్పాను.

"ఎవరు అనాగరికులు ?" అని అడిగింది ఆమె. ఇంత వరకు ఎవరూ నన్ను ఈ ప్రశ్న వేయ లేదు. నేను నిట్టూర్చాను. ఆమే చెప్పింది.

"మీ పట్టణాల్లో, నగరాల్లో అనాగరికులు లేరా ? ఆడపిల్ల పుట్టబోతున్నదని తెలియగానే గర్భస్రావం చేయిస్తారు ఎందుకని ? ఆడపిల్ల పట్ల చిన్నప్పటి నుంచి వివక్ష చూపిస్తారు. ఎందుకని ? స్వేచ్ఛగా తిరగనివ్వరు. ఎందుకని ? వివాహం సమయం లో కట్నం పేరుతో లక్షలు లక్షలు గుంజుతారు. ఎందుకని ? అది తీసుకు రాక పోతే నిర్దయ గా చంపేసి మరొక అమ్మాయితో వివాహం జరిపిస్తారు. నెత్తురు రుచి మరిగిన జంతువుకూ, దబ్బు రుచి మరిగిన ఈ మగవాళ్ళకు తేడా ఏమన్నా ఉందా ? " అని అడిగింది.

నిజమే. ఆ అనాగరికులు. ఆడపిల్లను ఎత్తుకు పోయి వివాహం చేసుకునే మాట నిజమే. కానీ ఆ తరువాత వాళ్ళు జీవితాంతం అన్యోన్యంగా ఉంటారు. కానీ మహా నగరాల్లో మగవాళ్ళు ఆడవాళ్ళను ఎత్తుకు పోయి, మాన భంగం చేసి, చివరకు చంపేస్తున్నారు ? ఎవరు అనాగరికులు ?" అని అడిగింది ఆమె.

ఆ ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేదు. మీరు ఏమన్నా చెప్పగలరా ?

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.